# ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు

◆ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కోస్గిరూరల్, అక్టోబర్ 8: ప్రతిపక్షాలు చెప్పే కల్లబొల్లి మాటలను ప్రజలు ఎవ్వరూ నమ్మరాదని, మోసపూరిత మాటలను నమ్మి మోసపోవొద్దని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కోస్గి మున్సిపాలిటీలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పట్నం ఆదివారం ప్రారంభించారు. పలు వార్డుల్లో కబ్రస్థాన్, ఆలయాల కాంపౌండ్‌వాలు, షెడ్డు, సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మున్సిపాలిటీలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొడంగల్ నియోజకవర్గంలో ఐదేండ్ల కాలంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పూర్తిచేసుకున్నామన్నారు. ప్రజలు అభివృద్ధిని చూసి ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఈజీఎస్ స్టేట్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ రామకృష్ణ, పట్టణాధ్యక్షుడు రాజేశ్, పీఏసీసీఎస్ చైర్మన్ తూంభీంరెడ్డి, జెడ్పీటీసీ ప్రకాశ్‌రెడ్డి, కౌన్సిలర్లు శ్రీను, బాలేశ్, నాయకులు హరి, వెంకట్‌నర్సింహులు, హన్మంత్ పాల్గొన్నారు.

## ఉత్సాహంగా 'మెడికోలా'

◆ అలరించిన వైద్యవిద్యార్థుల ఆటాపాటలు



డ్యాన్స్‌తో అలరిస్తున్న వైద్యవిద్యార్థులు

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, అక్టోబర్ 8: మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 2019 ఎంబీబీఎస్ విద్యార్థుల ఇంతూజియా వేడుకలను ఈనెల 3వ తేదీ నుంచి 8వతేదీ వరకు వైద్య విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం కళాశాలలో నిర్వహించిన ముగింపు వేడుకలకు మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రమేశ్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు సమన్వయంతో ఆటాపాటలు నిర్వహించుకున్నారని పేర్కొన్నారు. వైద్యవిద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, వైద్యవిద్యను అభ్యసించడం అదృష్టంగా భావించాలని తెలిపారు. అనంతరం వైద్య విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహించిన క్రికెట్, కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఆలరించిన నృత్యాల్లో ఉత్సాహంగా వేడుకలను ముగించుకున్నారు. కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ జీవన్, వైస్ ప్రిన్సిపాల్ నవకల్యాణి, హెచ్‌వోడీలు డాక్టర్ పార్వతి, డాక్టర్ ఉష, డాక్టర్ ప్రేమ, డాక్టర్ రమాదేవి, ఎన్ఎంసీ సమన్వకర్త కిరణ్‌ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ సమ్మేళనం

వంగూరు, అక్టోబర్ 8: మండలంలోని వంగూరు, రంగాపూర్ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళాన్ని నిర్వహించారు. వంగూరు ప్రభుత్వ పాఠశాలలో 1990-91 బ్యాంచ్ పదో తరగతి విద్యార్థులు, రంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆనాటి గురువులను సన్మానించడంతోపాటు విద్యార్థులు అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆత్మీయ సమ్మేళనాలు ఎంతో ఆత్మీయంగా జరుపుకోవడం విశేషమని పేర్కొన్నార. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



రంగాపూర్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

# దశాబ్దాల స్వప్నం.. స్వరాష్ట్రంలో సాకారం


◆ ఉమ్మడి పాలనలో సాగునీటికి నోచుకోని అచ్చంపేట ◆ తలాపునే కృష్ణమ్మ పారుతున్నా నోళ్లు తెరుచుకున్న భూములు

◆ కరువునేలకు నీటిని పారించేందుకు రంగం సిద్ధం ◆ అచ్చంపేట ప్రాజెక్టుకు సీఎం కేసీఆర్ డిజైన్ ◆ రేపు శంకుస్థాపన చేయనున్న మంత్రి కేటీఆర్

అచ్చంపేట, అక్టోబర్ 8: ఉమ్మడి రాష్ట్రంలో అచ్చంపేట నల్లమల ప్రాంతం తీవ్ర వంచనకు గురైంది. గత పాలకుల పట్టింపులేమీతో అచ్చంపేట ప్రాంతం కరువుకు నెలవైంది. సమైక్య పాలనలో ఆకలి, వలసలు, క్లుప్తంగా చెప్పాలంటే జీవన విధ్వంసం. ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు మారినా.. బతుకులు మారలేదు. తాగు, సాగునీటి తండ్లాట తప్పలేదు. అచ్చంపేటను పాలించిన పాలకులు శాశ్వత పరిష్కారం చూపించలేకపోయారు. తీవ్ర వలసల అచ్చంపేట అనే పేరును మూటగట్టుకున్నది. తలాపున కృష్ణమ్మ పరుగులు తీస్తున్నా.. సాగునీరు లేక నెర్రెలుబారాయి. శాశ్వతమైన నీటి వనరులు లేక నల్లమల ప్రాంతం వర్షపాతంపైనే ఆధారపడి ఉంటుంది. ఒక్కోఏడాది చాలా తక్కువ వర్షపాతం నమోదై కరువు నెలకొనే పరిస్థితి ఉండేది. వర్షాకాలంలో భారీగా వర్షాలు పడిన సంవత్సరాల్లో కూడా వర్షపాతం సమంగా ఉండకమధ్యలో రెండు, మూడు వారాలు, ఒక్కోసారి నెల న్నరకుపైగా ఒక్క వర్షపు చుక్క కూడా రాలని పొడి పరిస్థితులు ఉండేది. ఈ సంవత్సరమే అందుకు ప్రత్యక్ష ఉదాహరణగా చెప్పవచ్చు. అలాంటి పరిస్థితుల్లో సాగు, తాగునీటికి రైతులు, ప్రజలు అల్లాడిపోకుండా ఉండాలంటే వరదను ఒడిసిపట్టడమే ఏకైకమార్గం. నీళ్లకోసం అనేక గోసపడిన నల్లమల ప్రజానీకానికి శాశ్వత పరిష్కారం చూపించలేకపోయారు. సముద్రమట్టానికి 680మీటర్ల ఎత్తులో ఉన్న అమ్రాబాద్, పదర మండలాలకు సాగునీరు తేవాలనేది అప్పటి పాలకులకు ఆలోచన కూడా లేదు. అటువైపు దృష్టిపెట్టలేదు. 60ఏండ్ల సమైక్య పాలకుల చేతిలో అచ్చంపేట ప్రాంతం అరిగోసలు అనుభవించింది. దగా పడింది. ఎత్తైన ప్రాంతంలో ఉన్న అమ్రాబాద్, పదర మండలాలకు సాగునీరు ఇవ్వడం సాధ్యంకాదని వదిలేశారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ అపర భగీరథుడిలా ముందుచూపుతో రైతుల కన్నీళ్లు తూడ్చేందుకు సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యతగా తీసుకున్నారు. సీఎం కేసీఆరే స్వయంగా రూపకల్పన చేసిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా అచ్చంపేట సాగునీటి ఎత్తిపోతల పథకాన్ని రూపకల్పన చేశారు. అచ్చంపేట సాగునీటి ఎత్తిపోతల పథకంతో అచ్చంపేట కరువునేలకు కృష్ణమ్మ బిరబిరా నడిచి రానున్నది. ఏండ్లుగా సాగునీటి గోస అనుభవిస్తున్న అచ్చంపేట నల్లమల ప్రాంతానికి జలనిధి కనిపించనున్నది. సాగునీరు పారే అవకాశం లేని అమ్రాబాద్, పదర మండలాలకు సైతం సాగునీరు పారనున్నది. అచ్చంపేట ప్రాజెక్టుతో కృష్ణా జలాలకు నల్లమల స్వాగతం పలకనున్నది. అచ్చంపేట రైతాంగానికి మంచిరోజులు రానున్నాయి. నల్లమల రైతుల కలసాకారం కానున్నది. కొన్ని దశాబ్దాల అచ్చంపేట దుర్భిక్షాన్ని పారద్రోలి వేలాది ఎకరాలకు సాగునీటిని, అచ్చంపేట సాగునీటి ఎత్తిపోతల ప్రాజెక్టుకు రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయనున్నారు.

### అచ్చంపేట ప్రాజెక్టుకు సీఎం కేసీఆర్ డిజైన్

అచ్చంపేట రైతాంగానికి సాగునీరు తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వ విప్ డాక్టర్ గువ్వల బాలరాజు నీటిపారుదల సమీక్ష సమావేశాల్లో అనేకసార్లు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమీక్ష సమావేశాల్లో సీఎం కేసీఆర్ అచ్చంపేట నియోజకవర్గంలోని నీటి పారుదల ప్రాజెక్టులైన కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, చిన్ననీటి పారుదల ప్రాజెక్టులపై పూర్తి సమీక్ష చేసి సాగునీరు అందని మండలాలను గుర్తించి వాటికి సాగునీరు అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని 2021 మార్చి 23న చీఫ్ ఇంజనీర్‌ను ఆదేశించారు. అచ్చంపేట నియోజకవర్గంలోని అత్యంత వెనుకబడిన లింగాల, అమ్రాబాద్, పదర, బల్మూర్, అచ్చంపేట మండలాల్లోని దాదాపు 75వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు సీఎం కేసీఆర్ సర్వేకు ఆదేశాలిచ్చి నివేదిక తెప్పించుకొని అచ్చంపేట ఎత్తిపోతల ప్రాజెక్టును స్వయంగా సీఎం కేసీఆరే డిజైన్ చేశారు.పాలమూరు - రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ఎదుల రిజర్వాయర్ నుంచి 25కిలో మీటర్ల గ్రావిటి కాల్వ తవ్వి లింగాల మండలం సూరాపూర్‌కు నీటిని తరలిస్తారు. ఇక్కడ ఏర్పాటు చేసిన లిఫ్ట్ ద్వారా నీటిని 70మీటర్ల ఎత్తుకు ఎత్తిపోసి బల్మూర్ మండలం మైలారం వద్ద నిర్మించనున్న ఉమామహేశ్వరం రిజర్వాయర్‌ను నింపుతారు. ఉమామహేశ్వర రిజర్వాయర్ యొక్క సామర్థ్యం 2.50 టీఎంసీలు ఉంటుంది. ఉమామహేశ్వరం రిజర్వాయర్ నుంచి కాల్వ తీసి బల్మూర్, లింగాల, అచ్చంపేట మండలాల్లోని 45వేల ఎకరాలకు సాగునీరు అందిస్తారు. ఉమామహేశ్వర రిజర్వాయర్ నుంచి ఒక కాల్వ తీసి చంద్రవాగు ద్వారా చంద్రసాగర్‌ను నింపుతారు. చంద్రసాగర్ కట్టను మెరుగు పరిచి 0.3 టీఎంసీ నీటిని నిల్వ ఉంచుతారు. చంద్రసాగర్ పైభాగాన ఒక లిఫ్టును ఏర్పాటు చేసి మన్ననూర్ దగ్గర నిర్మించే చెన్నకేశవ రిజర్వాయర్‌కు పంప్ చేస్తారు. చెన్నకేశవ రిజర్వాయర్ సామర్థ్యం 1.5టీఎంసీలు. చెన్నకేశవ రిజర్వాయర్ నుంచి పదర, అమ్రాబాద్ మండలాల్లోని 25వేల ఎకరాలకు సాగునీరు అందిస్తారు. అచ్చంపేట ఎత్తిపోతల పథకం కింద మొత్తం 75వేల ఎకరాలకు సాగునీరు అందిస్తారు. రూ.1,061 కోట్లతో టెండర్ పిలువగా బృందా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 4.2 ఎక్సెస్‌తో టెండర్ దక్కించుకున్నది. మంత్రి కేటీఆర్ ప్రాజెక్టు పైలాన్‌ను ఆవిష్కరింపజేసిన తర్వాత పనులు పరుగులు పెట్టనున్నది.



అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ నమూనా

### రైతుల కాళ్లను కృష్ణమ్మతోక డగాలనేదిలక్ష్యం



రాజకీయ జన్మనిచ్చిన అచ్చంపేట నియోజకవర్గప్రజలు, రైతుల రుణం తీర్చుకునేందుకు గత పాలకులు అసాధ్యమని భావించిన అచ్చంపేట సాగునీటి ఎత్తిపోతల పథకాన్ని సాధించాను. అచ్చంపేట ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాను. సీఎం కేసిఆర్ అచ్చంపేట ప్రజలపై ఉన్న మమకారంతో ఆయనే స్వయంగా ప్రాజెక్టును డిజైన్ చేసి ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేశారు. అనేక సార్లు సీఎం కేసిఆర్ దృష్టికి తీసుకెళ్లిన. అసెంబ్లీలో ప్రస్తావించిన. బిరబిరా పారుతున్న కృష్ణమ్మను నల్లమల ప్రాంతానికి పారించి నా రైతుల కాళ్లను కృష్ణమ్మతో కడుగాలనే లక్ష్యంగా పెట్టుకున్నాను. సాకరమైంది. నల్లమల బీడు పోలాలకు కృష్ణమ్మను పారించి సస్యశ్యామలం చేస్తా. గత దశాబ్ధాలుగా ఎదురుచూస్తున్న సాగునీటి కల సంబురం రానే వచ్చింది. ఈ నెల 10న మంత్రి కేటిఆర్ చేతులమీదుగా ఆవిష్కృతం కానున్నది. రైతుల చిరకాల వాంఛ నెరవేర్చడం సంతోషకరంగా ఉన్నది. అచ్చంపేట రైతులను రాజు చేయడమే సంకల్పం. సాగునీరు వస్తే అచ్చంపేట ప్రాంతం రూపురేఖలు మారనున్నాయి.

-ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

# సీఎం కేసీఆర్ పాలనలో గ్రామాలుసస్య శ్యామలం

◆ సంక్షేమ పథకాల అమలులో అగ్రగామిగా తెలంగాణ ◆ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ◆ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

పాన్‌గల్, అక్టోబర్ 8: సీఎం కేసీఆర్ పాలనలో సాగునీటి రాకతో గ్రామాలు సస్యశ్యామలమైనట్లు కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. గట్టు రిజర్వాయర్‌తో కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పాన్‌గల్, శ్రీరంగాపూర్, వనపర్తి నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు పుష్కలంగా సాగునీరు అందనున్నట్లు తెలిపారు. ప్రతిఎకరాకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్ల ఏర్పాటు, మిషన్ కాకతీయతో చెరువులు, కుంటల పునరుద్ధరణ పనులను ప్రభుత్వం చేపట్టినట్లు తెలిపారు. సీఎం ప్రవేశ పెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు దేశంలోనే అగ్రగామిగా నిలిచాయన్నారు. క్రార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు వెంకటయ్య, ఉపాధ్యక్షుడు సోమనాథ్‌నాయక్, మాజీ జెడ్పీటీసీ రామ్మూర్తినాయుడు, న్యాయవాది రవికుమార్, దశరథ్‌నాయుడు, దేవేందర్ నాయుడు, నాయకులు అభిలాశ్‌రావు, జైపాల్‌రెడ్డి, తిరుపతియాదవ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



చింతకుంటలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బీరం